
సాక్షి ఒడిశా

శనివారం । 8 । జూన్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం పాండిలో భక్తుల కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,94,623లు, బంగారం 150 మిల్లీగ్రాములు, వెండి 27 గ్రాముల 950 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

నేడు బీజేపీ శాసనసభా పక్షం సమావేశం



బీజేపీ ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించేందుకు శనివారం శాసనసభా పక్షం సమావేశం జరగనుంది.

- 8లో



రథయాత్రకు సన్నాహాలు

రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో రథయాత్రకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి.

- 8లో

న్యూస్‌రీల్

ఈనెల 10కి రాష్ట్రానికి రుతు పవనాలు

భువనేశ్వర్: ఈనెల 10వ తేదీ నాటికి నైరుతి రుతు పవనాలు రాష్ట్రానికి తాకే అవకాశం ఉందని స్థానిక భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. రుతు పవనాల ఆగమనానికి పరిస్థితులు చాలా అనుకూలంగా ఉన్నాయి. నైరుతి రుతుపవనాలు సాధారణంగా జూన్ రెండో వారంలో రాష్ట్రానికి చేరుతాయి. రానున్న మూడు, నాలుగు రోజుల్లో రుతుపవనాలు దక్షిణ ఒడిశాకు చేరుకుంటాయని భావిస్తున్నామని స్థానిక ఐఎండీ డైరెక్టర్ మనోరమ మహంతి తెలిపారు. ఈనెల 5న నైరుతి రుతు పవనాలు కేరళకు చేరుకున్నాయి. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకారం నైరుతి రుతు పవనాలు మొత్తం దక్షిణ అరేబియా సముద్రం, మధ్య అరేబియా సముద్రంలోని కొన్ని ప్రాంతాలు, లక్షద్వీప్, కేరళ తీరప్రాంతం, దక్షిణ అంతర్గత కర్ణాటక, తమిళనాడు మరియు బంగాళాఖాతం కొన్ని ప్రాంతాల్లో పురోగమించాయి. మరోవైపు రాయగడ, నవరంగ్‌పూర్, కొరాపుట్ జిల్లాలకు ఐఎండీ ఎల్లో వార్నింగ్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. రుతుపవనాల రాకతో రాష్ట్రంలో వ్యవసాయానికి మేలు జరుగుతుందని భావిస్తున్నారు.

నదిలో మునిగి వృద్ధుడు మృతి



మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జయపురం: నవరంగ్‌పూర్ జిల్లా దాబుగాం సమితి కుండీగుడ గ్రామ సమీప నదిలో ప్రమాదవశాత్తు మునిగి వృద్ధుడు దుర్మరణం పాలయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. ఆ గ్రామానికి చెందిన దొంబు దాస్ (65) భార్య వాంతులు విరోచనాలతో బాధపడుతూ దాబుగాం కమ్యూనిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో ఆమెను చూసేందుకు దొంబు దాస్ ఆస్పత్రికి బయల్దేరాడు. అతడు గ్రామ సమీపంలో ఉన్న నది మధ్య నుంచి వెళ్తుండగా నదిలో నీరు ఎక్కువగా ఉండటంతో మునిగిపోయాడు. అది పరిసర ప్రాంతంలో ఉన్న ప్రజలు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో గ్రామ ప్రజలతో పాటు అతడి కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి వచ్చి దాబుగాం అగ్నిమాపక విభాగానికి తెలియజేశారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి నదిలో విస్తృతంగా గాలించారు. అనంతరం దొంబు దాస్‌ని కనుగొని బయటకు తీశారు. అతడిని వెంటనే దాబుగాం కమ్యూనిటీ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అయితే అతను అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ప్రకటించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు పశువుల మృతి




పిడుగు పడడంతో మృతి చెందిన పశువులు

రాయగడ: పిడుగుపాటుకు రెండు పశువులు మృతి చెందిన ఘటన జిల్లాలోని కాసీపూర్ సమితి సుంగేర్ గ్రామంలో చోటుచేసుకుంది. గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో చెట్టు కింద కట్టి ఉంచిన ఆవు, గేదెపై పిడుగు పడడంతో అక్కడికక్కడే మరణించాయి. ఇదిలా ఉండగా సుంగేర్‌లో గురువారం జరిగిన వారాంతపు సంత కూడా వర్షం కారణంగా చిన్నాభిన్నమయ్యింది. ఇతర ప్రాంతాల నుంచి సంతలో సామాన్లను విక్రయించేందుకు వచ్చిన చిరువ్యాపారస్తులు వేసుకున్న టెంట్లు ఈదురు గాలులకు ఎగిరిపోయాయి. కొందరి సామాన్లు తడిసిపోవడంతో నష్టాల బారిన పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు.



ఎగిరిపోయిన టెంట్లు

నేటి నుంచి వడగాలుల తీవ్రత



- కొన్నిచోట్ల 2 నుంచి 3 డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగే అవకాశం

భువనేశ్వర్: రాష్ట్రంలో శనివారం నుంచి కొన్ని ప్రాంతాల్లో వడగాల్పుల తీవ్రత పెరగనున్నట్లు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శుక్రవారం తెలిపింది. రానున్న 3 రోజుల్లో రాష్ట్రంలో చాలా చోట్ల పగటి పూట ఉష్ణోగ్రత 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్‌కు పెరిగే సంకేతాలు జారీ అయ్యాయి. వాతావరణ సంస్థ సమాచారం ప్రకారం ఈనెల 11 వరకు బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రాపడా, కటక్, జగత్‌సింగ్‌పూర్, పూరీ, ఖుర్దా, నయాగడ్, గంజాం మరియు గజపతి జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల వేడి మరియు తేమతో కూడిన వాతావరణం కొనసాగవచ్చు. పూరీ, ఖుర్దా, నయాగడ్, గంజాం, గజపతి, సోన్‌పూర్, బౌధ్, నువాపడా, బొలంగీర్, కలహండి, కంధమల్, నవరంగ్‌పూర్, రాయగడలో ఒకటి లేదా రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జడి వాన హెచ్చరికలు కూడా జారీ చేయబడ్డాయి. శనివారం బర్‌గడ్, బొలంగీర్, నువాపడా జిల్లాల్లో వేడిగాలులు వీచే అవకాశం ఉంది. మల్కన్‌గిరి, కొరాపుట్, రాయగడ, నవరంగ్‌పూర్, గజపతి, గంజాం, కలహండి, కంధమల్, సుందర్‌గఢ్, మయూర్‌భంజ్, కెంజొహర్, అంగుల్, ఢెంకనాల్ ప్రాంతాల్లో ఒకటి లేదా రెండు చోట్ల గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో కూడిన ఉపరితల గాలులతో వర్షం కురిసే అవకాశం ఉంది.

రానున్న 24 గంటల్లో...

రానున్న 24 గంటల్లో బర్‌గడ్, బొలంగీర్, నువాపడా, సోన్‌పూర్, బౌద్‌లలో ఒకటి లేదా రెండు చోట్ల వేడి గాలుల హెచ్చరిక జారీ అయింది. మల్కన్‌గిరి, కొరాపుట్, నవరంగ్‌పూర్, కలహండి, కంధమల్, రాయగడ, గజపతి, గంజాం, నయాగడ్, సంబల్‌పూర్, దేవ్‌గడ్, కెంజొహర్, సుందర్‌గడ్, మయూర్‌భంజ్ జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఉపరితల గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. జూన్ 10, 11 తేదీల్లో బర్‌గడ్, సోన్‌పూర్, బౌధ్, సంబల్‌పూర్ మరియు ఝార్సుగుడలో ఒకటి లేదా రెండు ప్రదేశాల్లో వేడి గాలుల వాతావరణం నెలకొంటుంది. జూన్ 10న కొరాపుట్, మల్కన్‌గిరి, రాయగడ, గజపతి, గంజాం, కంధమల్, బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రాపడా, ఢెంకనాల్లో ఒకటి రెండు చోట్ల, జూన్ 11న కొరాపుట్, నవరంగ్‌పూర్, కలహండి, కంధమల్, మయూర్‌భంజ్, కెంజొహర్ జిలాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వాన సంకేతాలు వాతావరణ సంస్థ జారీ చేసింది.

విపత్తు సమీక్ష

వాతావరణంలో చోటు చేసుకోనున్న వేడిగాలుల వాతావరణం నేపథ్యంలో క్యాబినెట్ సెక్రటరీ రాజీవ్ గౌబ అధ్యక్షతన జాతీయ విపత్తు నిర్వహణ కమిటీ వాతావరణ మార్పు తీవ్రత, నిర్వహణ కార్యాచరణ వర్చువల్ మాధ్యమంలో సమీక్షించింది. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రముఖ కార్యదర్శి మరియు ప్రత్యేక సహాయ కమిషనరు(ఎస్ఆర్‌సీ) హాజరయ్యారు.



సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

మాజీ సీఎం నవీన్‌తో నబరంగ్‌పూర్ మాజీ ఎంపీ రమేష్ మజ్జి తదితరులు



మాజీ సీఎం నవీన్‌తో కొరాపుట్ నేతల భేటీ

కొరాపుట్: బిజు జనతా దళ్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్‌తో కొరాపుట్ నేతలు శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తాము ఓడిపోవడానికి గల కారణాలను వివరించారు. పార్టీ నాయకులకు, అధినేతకు దూరం పెరగడంతోనే ఇటువంటి పరిస్థితి వచ్చిందని వాపోయారు. దీంతో నవీన్ అందరికీ ధైర్యం చెప్పారు. గెలిచినా, ఓడినా ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలని సూచించారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజం అన్నారు. ఉత్కళ ప్రజలు ఎన్నడూ బీజేడీని వీడరని దీమా వ్యక్తం చేశారు. అధికారం లేకపోయినా 51 మంది ఎమ్మెల్యేలు, రాజ్యసభ ఎంపీలు, రాష్ట్రవ్యాప్తంగా జిల్లా పరిషత్, మున్సిపల్, గ్రామీణ స్థాయి అనేక రాజ్యాంగ పదవుల్లో వేలాది మంది బీజేడీ నాయకులు ఉన్నారని గుర్తు చేశారు. సమావేశంలో నబరంగ్‌పూర్ మాజీ ఎంపీలు రమేష్ చంద్ర మజ్జి, ప్రదీప్ మజ్జి, కొరాపుట్ మాజీ ఎంపీ జిన్ను హిక్కా, 13 విధాన సభ స్థానాలలో పోటీ చేసిన బీజేడీ అభ్యర్థులు పాల్గొన్నారు.



నవీన్‌తో కొరాపుట్ మాజీ ఎంపీ జిన్ను హిక్కా, కౌసల్య హిక్కా దంపతులు



నవీన్‌తో నబరంగ్‌పూర్ మాజీ ఎంపీ ప్రదీప్ మజ్జి

గేదె మాంసం తినడంతో ముగ్గురికి అస్వస్థత



ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికారులు

జయపురం: కొరాపుట్ జిల్లా దసమంతపూర్ సమితి పిండాపాదర్ గ్రామ పంచాయతీ కొటికిపాదర్ గ్రామంలో చనిపోయిన గేదె మాంసం తిని ముగ్గురు అస్వస్థతకు గురయ్యారు. సమాచారం అందడంతో కొరాపుట్ నుంచి ఒక వైద్య బృందం ఆ గ్రామానికి చేరింది. ఇప్పటికే ఆ సమితిలోని కొన్ని గ్రామాల్లో ఆంత్రాక్స్ వ్యాధి సోకిన విషయం తెలిసిందే. దీంతో అస్వస్థత గురైన మసధర ముదులి, ఘాశీ ముదులి, ధొబా ముదులిలను పరీక్షించి ఆంత్రాక్స్ వ్యాధి లక్షణాలు ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. వారితో పాటు మరో ఇద్దరు అనారోగ్యానికి లోనైనట్లు గ్రామస్తులు వెల్లడించారు. వీరి రక్తనమూనాలు సేకరించారు. దీంతో వ్యాధి తీవ్రతంగా ఉన్న ముగ్గురి నుంచి శాంపిల్స్ తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మరణించిన పశువులు, మేకలు, గొర్రెల మాంసం తినడం చాలా ప్రమాదమని వివరించారు. ఈ వ్యాధి వలన మనుషులు మరణించే అవకాశం ఉందని హెచ్చరించారు. మృతి చెందిన పశు మాంసం తినకూడదన్నారు.



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య బృందం

బీజేడీ నాయకులతో సమావేశం

భువనేశ్వర్: సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి అనంతరం బిజు జనతా దళ్ అధ్యక్షుడు, మాజీ సీఎం నవీన్ పట్నాయక్ తన నివాసంలో గెలిచిన, ఓడిపోయిన అభ్యర్థులతో వరుసగా 2 సార్లు సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో నవీన్ పట్నాయక్‌కు అనుక్షణం వెన్నంటి తిరుగాడిన వి.కార్తికేయ పాండియన్ జాడ లేకపోవడం చర్చనీయాంశమైంది. పార్టీ వ్యవహారాలను నిర్వహించేందుకు ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని తీర్చిదిద్దడంపై నవీన్ పట్నాయక్ నిర్లక్ష్యం వహించడంతో ఈ విపత్కర పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చిందని విజ్ఞుల వర్గం అభిప్రాయపడుతుంది. ఎన్నికల్లో ఓటమి పాలైన అభ్యర్థులతో పార్టీ పేలవమైన పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

జంట ఎన్నికల్లో పార్టీ పనితీరుపై నవీన్ సవివరంగా చర్చించారు. రాజకీయాల్లో గెలుపు, ఓటమి సమర్థంగా ఎదుర్కొనే మానసిక స్థైర్యంతో ముందుకు సాగాలని అభ్యర్థులను ఆప్యాయంగా పలకరించారు. ఓడిపోయిన మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు బీజేడీ సంస్థ కార్యదర్శి ప్రణబ్ ప్రకాష్ దాస్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇతర ప్రముఖుల్లో దేబీ ప్రసాద్ మిశ్రా, అతను సబ్యసాచి నాయక్, రోహిత్ పూజారి, ప్రీతిరంజన్ ఘడెయ్, బిక్రమ్ కేశరి అరూఖ్, అశోక్ చంద్రపండా, గోపబంధు దాస్, కౌశల్య ప్రధాన్, శ్రీకాంత్ సాహు, మన్మథ్ రౌత్రాయ్, ప్రదీప్ మాఝీ, రంజితా సాహు, అబినాష్ సామల్, కల్పన్న సేథి, రాజశ్రీ మల్లిక్, మంజులత మండల్, లేఖశ్రీ సామంతసింగర్ తదితరులు ఉన్నారు.



పార్టీ నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న నవీన్ పట్నాయక్

ఘనంగా ఆలయ ప్రతిష్ఠోత్సవాలు



నబరంగ్‌పూర్‌లో గణేష్ మందిరం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని రాజువీధిలో ఉన్న గణేష్ మందిర ప్రతిష్ఠోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉదయం రాజ పురోహితుడు నర్సింగ త్రిపాఠి సేతృత్వంలో 13 మంది వేద పండితులు కార్యక్రమాలు ప్రారంభించారు. సూర్యకాంతితో యజ్ఞమండంలో అగ్ని వెలిగించారు. అంకురార్పణ చేసి పూజలు ప్రారంభించారు. దేవాలయం ఉన్న ప్రాంతంలో గతంలో స్థానిక యువకులు గణేష్ ఉత్సవాలు చేసేవారు. కాల క్రమేణ కమిటీగా ఏర్పడి 2014లో గణేష్ దేవాలయం నిర్మించారు. మందిరం అభివృద్ధి చెందడంతో 2019లో విఘ్నేశ్వరుడికి అన్నదమ్ములైన అయ్యప్ప, కార్తికేయ దేవాలయాలు నిర్మించారు. అనంతరం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో సామాజిక భవనం నిర్మించారు. ప్రస్తుతం దేవాలయాల ముఖ ద్వారం, శిఖర ప్రతిష్ఠలు చేస్తున్నారు. ఈ ప్రతిష్ఠోత్సవాలు 11వ తేదీ వరకు కొనసాగుతాయి. ఆదేరోజు రాత్రి సామూహిక ప్రసాద సేవన కార్యక్రమం జరుగుతుంది. వీటి నిర్మాణం కోసం భక్తులు, కమిటీ విరాళాలతో పాటు దాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి రూ.5 లక్షలు, నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రదాని రూ.3 లక్షలు, 5టీ నుంచి రూ.5 లక్షల ప్రభుత్వ నిధులు అందాయి.



అంకురార్పణ చేస్తున్న వేద పండితులు



- దాహం కేకలు



జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితి గ్రామీణ ప్రాంత ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనేక గ్రామాల్లో నేటికీ పాలకులు తాగునీటి వనరులు కల్పించకపోవడంతో పలు గ్రామాల ప్రజలు మూడు, నాలుగు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నారు. కొంతమంది పురుషులు సైకిళ్లపై బిందెలతో నీరు తీసుకొస్తున్నారు. ముఖ్యంగా బమిని జియగుడ గ్రామానికి చెందిన ప్రజలు ఉదయం అవ్వగానే సుమారు 3 కిలోమీటర్లు వెళ్లి, అక్కడ గంటల కొద్ది నీటికోసం పాట్లు పడుతున్నారు. దీంతో రోజంతా తాగునీటి కోసమే వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు తాగునీటి ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు. - జయపురం

క్లుప్తంగా

అడ్వకేట్ జనరల్‌గా జ్యోతి ప్రకాష్

భువనేశ్వర్: రాష్ట్ర తాత్కాలిక అడ్వకేట్ జనరల్ (ఏజీ)గా జ్యోతి ప్రకాష్ పట్నాయక్ నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం ప్రభుత్వ న్యాయవాదిగా కొనసాగుతున్నారు. ఇప్పటి వరకు ఏజీగా బాధ్యతలు నిర్వహించిన అశోక్‌కుమార్ పరిజా రాజీనామా చేయడంతో ఈ నియామకంతో సర్దుబాటు చేశారు. ప్రభుత్వ న్యాయవాది జ్యోతి ప్రకాష్ పట్నాయక్ తన స్వంత విధులతో పాటు రోజువారీ పనిని నిర్వహించడానికి అడ్వకేట్ జనరల్‌గా కొనసాగడానికి అనుమతిస్తున్నట్లు న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జ్యోతి ప్రకాష్‌పట్నాయక్ అడ్వకేట్ జనరల్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. ఇంతకుముందు హోదాలో బాధ్యతలను సైతం యథాతథంగా కొనసాగించాల్సి ఉంటుందని ఉత్తర్వులు పేర్కొన్నాయి. బిజూ జనతా దళ్ ప్రభుత్వం 2019లో అశోక్ కుమార్ పరిజాను అడ్వకేట్ జనరల్‌గా నియమించింది. 2024 శాసన సభ ఎన్నికల్లో ఆ పార్టీ విజయం సాధించడంలో విఫలమవ్వడంతో ఆయన ఆ పదవికి రాజీనామా చేశారు.

ప్రారంభమైన అగ్ని గంగమ్మ ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో అగ్ని గంగమ్మ అమ్మవారు

రాయగడ: స్థానిక పిట్టలవీధిలో పూజలు అందుకుంటున్న అగ్ని గంగమ్మ అమ్మవారి వార్షిక ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఐదు రోజులు పాటు జరిగే ఈ ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. శుక్రవారం సాయంత్రం అమ్మవారికి ప్రీతికరమైన ఆదివాసీ వాయిద్యాల నడుమ స్థానిక కేఎన్‌కే మిల్ సమీపంలోని గుడి వద్ద నుంచి పాదాలను తీసుకువచ్చి మందిరంలో కొలువుదీర్చారు. ఐదు రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహి స్తారు. మంగళవారం రాత్రి అమ్మవారి ప్రధాన ఘట్టమైన మల్లెల్లో పూజారి నడుస్తారు. మందిరం ప్రధాన అర్చకులు బలముండ ఆధ్వర్యంలో ఈ పూజలను నిర్వహిస్తున్నారు.


నీటిలో మునిగి యువకుడి మృతి



సరోజ్ మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న దృశ్యం

రాయగడ: నీటిలో మునిగి ఒక యువకుడు మృతి చెందాడు. జిల్లాలో బిసంకటక్ సమితి చాటికొనలో ని గొడాగొదియా వాటర్ ఫాల్‌లో శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి మృతుడు గుణుపూర్‌కు చెందిన సరోజ్ కుమార్ మిశ్రో (25) గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. బరంపురంలో మాస్టర్ డిగ్రీ చదువుతున్న సరోజ్ వేసవి సెలవుల కోసం తన స్వగ్రామం వచ్చాడు. ఈ క్రమంలో శుక్రవారం నలుగురు స్నేహితులతో కలిసి బిసంకటక్ లోని ఖొలావీధిలోని తన మామయ్య ఇంటికి వెళ్లా డు. బిసంకటక్‌కు సమీపంలో ఉన్న చాటికొనలోని ప్రముఖ శైవక్షేత్రం పాతాలేశ్వర మందిరం పరిసర ప్రాంతాల్లో అందాలను వీక్షించేందుకు స్నేహితులతో కలిసి వెళ్లాడు. పాతాలేశ్వరుని దర్శనం అనంతరం అక్కడే గొడగొదియా జలపాతంలో స్నానం చేసేందుకు దిగాడు. అయితే ఈత తెలియని సరోజ్ నీటిలో గల్లంతయ్యాడు. తోటి స్నేహితులు ఈ విషయాన్ని బిసంకటక్‌లోని అగ్నిమాపక సిబ్బందికి తెలియజేశారు. రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది సుమారు మూడు గంటల సమయం జలపాతంలో గాలించి సరోజ్ మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని బయటకు తీసి కుటుంబీకులకు అప్పగించారు.

జాతీయ స్థాయి కవితల పోటీల్లో కుప్పిలికి ప్రథమ బహుమతి



కె.వి. రాజారావు, ఆమదాలవలస

ఆమదాలవలస: కెనడాకు చెందిన 'కవితా వేదిక' సంస్థ ఈ సంవత్సరం మార్చిలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన జాతీయ స్థాయి కవితల పోటీల్లో ఆమదాలవలసకు చెందిన కవి కుప్పిలి వెంకటరాజారావు రచించిన 'అనురాగం అస్తమిస్తున్న వేళ' అనే కవితకు ప్రథమ బహుమతి లభించింది. ఈ మేరకు ఆ సంస్థ నిర్వాహకులు నవీన్ చంద్ర మెయిల్ ద్వారా శుక్రవారం సమాచారం పంపారని కవి తెలిపారు. ఈ నెలలో జరిగే జూమ్ సమావేశంలో రాజారావు కవితా పఠనం, పురస్కారం కూడా ఆన్‌లైన్‌లో అందజేస్తారని వారు తెలిపినట్లు కవి కేవీ రాజారావు తెలిపారు. కవితా పఠనం యూట్యూబ్ ద్వారా ప్రసారం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆమదాలవలసకు చెందిన పలువురు సాహితీ వేత్తలు అభినందనలు తెలిపారు.

రథయాత్రకు సన్నాహాలు



కొరాపుట్: అలమండలో సిద్ధమవుతున్న జగన్నాథ రథం



పర్లాకిమిడి: రథాలకు చక్రాల ఇరుసులు ఎక్కిస్తున్న పనివారు



పర్లాకిమిడి: రథాల తయారీలో నిమగ్నమైన వడ్రంగులు



పర్లాకిమిడి: పాత రథ చక్రాలకు మరమ్మతులు



రాయగడలో నిర్మిస్తున్న రథం



రాయగడ: గుణుపూర్‌లో రథయాత్రకు సన్నాహక సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్, రాయగడ, బిసంకటక్, కల్యాణ సింగుపూర్‌లో రథయాత్రకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు గుణుపూర్‌లో పుర ప్రముఖులు, అధికారులతో సన్నాహక సమావేశం శుక్రవారం జరిగింది. గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగో, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శివప్రసాద్ గౌడొ, సబ్ కలెక్టర్ కరణ్ కౌర్ తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో రథయాత్ర నిర్వహణపై చర్చించారు. తొమ్మిది రోజుల పాటుగా జరిగే ఈ యాత్రను ఘనంగా నిర్వహించేందుకు సమావేశంలో నిర్ణయించారు. ఇదిలా ఉండగా రాయగడ పట్టణంలో తహసీల్దార్ ప్రియదర్శిన స్వయి నేతృత్వంలో రథ నిర్మాణం పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. అదేవిధంగా బిసంకటక్, కల్యాణ సింగుపూర్‌లలో ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి.

పర్లాకిమిడి: రథయాత్రకు పర్లాకిమిడిలో సన్నాహాలు జరుగుతున్నాయి. శుక్రవారం నుంచి రథానికి అవసరమయ్యే కలప, పాత రథ చక్రాలు, ఇరుసులు బయటకు తీసుకొచ్చి రథం పనులను మొదలుపెట్టారు. మూడు రథాలకు కొత్తగా అవసరమయ్యే కలప కోసం జిల్లా అటవీ శాఖ అధికారులకు ఇప్పటికే విన్నవించినట్లు రథయాత్ర కమిటీ సభ్యులు తెలియజేశారు. జూన్ 22న జగన్నాథ సన్నిధానంలో అడపా మందిరం వద్ద దేవస్నాన యాత్ర జరగనుంది.

కొరాపుట్: ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో తొలిసారిగా జగన్నాథ యాత్ర కోసం రథం సిద్ధమవుతోంది. కొరాపుట్ జిల్లా బందుగాం సమితి అలమండ పంచాయతీ కేంద్రానికి కూతవేటు దూరంలో ఆంధ్ర రాష్ట్రం ఉంది. ప్రజలు ప్రతి ఏడాది రథయాత్ర చడం కోసం సమీప సమితి కేంద్రం బందుగాం తరలి వెళ్లేవారు. అయితే స్థానిక ప్రజలు తొలిసారి 2023లో ఇక్కడ జగన్నాథ మందిరం నిర్మించుకున్నారు. దీంతో ఈ ఏడాది ప్రథమంగా రథయాత్ర చేయనున్నారు. జులై 7న జరిగే రథయాత్ర కోసం రథం సిద్ధం చేస్తున్నారు. తొలి రథయాత్ర రథం కావడంతో అందమైన చిత్ర కళతో కర్ర శిల్పాలు చెక్కిస్తున్నారు. ఇప్పటికే అందమైన జగన్నాథ మందిరం నిర్మించినందున ఈ ఏడాది అలమండలో రథయాత్ర వైభవంగా జరగనుంది.

స్కూటీ డిక్కీ నుంచి రూ.1.20 లక్షల చోరీ



డబ్బులు అపహరణకు గురైన స్కూటీ

రాయగడ: స్కూటీ డిక్కీలో నుంచి రూ.1.20 లక్షల నగదు చోరీ జరిగిన ఘటన స్థానిక తుంబిగుడ కూడలిలో బుధవారం చోటుచేసుకుంది. ఈ మేరకు బాధితులు సదరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఐఐసీ కేకేబీకే కుహరో తెలియజేసిన వివరాల ప్రకారం.. జిల్లాలోని కొలనార సమితి తెరువలి గ్రామానికి చెందిన రుకుణ హిమిరిక, ఆమె భర్త రామారావు బుధవారం రాయగడలోని ఎస్‌బీఐ ప్రధాన శాఖలో అవసరం మేరకు రూ.1.20 లక్షల నగదు విత్‌డ్రా చేసి, ఆ మొత్తం సొమ్మును బైకు డిక్కీలో ఉంచారు. అనంతరం రాయగడ డైలీ మార్కెట్‌లో షాపింగ్ చేసిన ఆ దంపతులు తెరువలి వెళ్లేందుకు బయల్దేరారు. ఈ క్రమంలో స్థానిక తుంబిగుడ వద్దనున్న ఒక దుకాణంలో బైకు ఆపి అక్కడ మరికొన్ని మార్కెట్ పనులు చూసుకున్నారు. అనంతరం బైకు దగ్గరకు వచ్చేసరికి బైకు డిక్కీ తెరిచి ఉండడం గమనించి, డిక్కీ తెరువగా అందులో ఉంచిన నగదు కనబడకపోవడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమేరాల ఆధారంగా దర్యాప్తును ప్రారంభించారు.

మరోచోట రూ.7 లక్షలు చోరీ

జయపురం: పట్టణంలోని ప్రధాన మార్గంలో కంద్రవీధి జంక్షన్ వద్దనున్న ఒక సెల్‌ఫోన్ దుకాణం ముందు ఉంచిన స్కూటీ డిక్కీలోని రూ.7 లక్షలు అపహరణకు గురైనట్లు పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో స్థానిక మదలా వీధికి చెందిన రాహుల్‌దేవ్ సామంతరాయ్ స్టేట్ బ్యాంక్ ప్రధాన శాఖలో రూ.7 లక్షలు విత్‌డ్రా చేసి తన స్కూటీ డిక్కీలో ఉంచాడు. అనంతరం కంద్రావీధి జంక్షన్‌లో ఒక మొబైల్ దుకాణం వద్ద స్కూటీని ఆపి ఆ దుకాణంలోకి వెళ్లాడు. అనంతరం దుకాణం నుంచి స్కూటీ వద్దకు వచ్చి చూడగా స్కూటీ సీటు తెరిచి ఉండడం కనిపించింది. అంతే కాకుండా తాను ఉంచిన డబ్బులు అపహరణకు గురవ్వడంతో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సామంతరాయ్ డబ్బు డ్రా చేసిన బ్యాంక్ నుంచి కొంద్రవీధి జంక్షన్ వరకు ఉన్నటువంటి సీసీ కెమేరాలను పరిశీలించారు. బ్యాంక్ నుంచి ఇద్దరు యువకులు సామంతరాయ్‌ను పాలో అవుతూ వచ్చినట్లు స్పష్టమైంది. దుండగులను పట్టుకునేందుకు పోలీసులు గాలిస్తున్నారు.

గోపాలపెంట ఇసుక ర్యాంపు పరిశీలన

నరసన్నపేట: మండలంలోని గోపాలపెంట ఇసుక ర్యాంపును శ్రీకాకుళం ఆర్డీఓ సీహెచ్ రంగయ్య శుక్రవారం పరిశీలించారు. మైన్స్, సర్వేయర్ సిబ్బందితో కలసి ర్యాంపును పరిశీలించారు. ఈ ర్యాంపులో ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన తనిఖీ చేశారు. అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈయన వెంట నరసన్నపేట తహసీల్దార్ కనకారావు, వీఆర్వో అప్పలనాయుడుతో పాటు అధికారులు ఉన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలు ముగింపు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ముగింపు వేడుకలు జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆడిటోరియంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రచయిత కాశీపట్నం సుబ్బారావు విచ్చేసి మాట్లాడారు. గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులు పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో మనో వికాసం వృద్ధి చెందుతుందన్నారు. ఖాళీ సమయంలో విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి జ్ఞానం పెంచుకోవాలని ఆకాంక్షించారు. శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజా మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను తప్పకుండా వినియోగించుకుని సమాజంలో ఒక మంచి క్రమశిక్షణ గల పౌరులుగా ఎదగాలన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ వీవీజీఎస్ శంకరరావు మాట్లాడుతూ ఏటా ఈ విధంగా గానే విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాల్లో పాల్గొనాలని, వేసవి సెలవుల్లోనే కాకుండా ప్రతి ఆదివారం గ్రంథాలయా నికి వచ్చి కొంత సేపు పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. అనంతరం వేసవి శిక్షణ శిబిరంలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. వేసవి శిక్షణ శిబిరం రిసోర్స్ పర్సన్లు కృష్ణారావు మాస్టర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవి దుక్కులతో భూమికి సారం



హిరమండలంలో ట్రాక్టర్‌తో వేసవి దుక్కులు చేస్తున్న రైతు

- తెగుళ్ల నివారణకు దుక్కులే మేలైన మార్గం
- రైతులకు వ్యవసాయాధికారుల సూచనలు

హిరమండలం: పంట పండించే ముందు భూసారం పెంచుకోవడం తెలివైన పని. వరస పెట్టి పంటలు పండిస్తూ భూసారాన్ని విస్మరిస్తే కాలక్రమంలో ఆయా భూములు నిస్సారమైపోతాయి. అందుకనే మన పూర్వీకులు ఖరీఫ్, రబీ సీజన్‌లలో పంటలు పండించిన భూముల్లో వేసవి దుక్కులు చేపట్టి భూసారాన్ని కాపాడేవారు. ఆధునిక కాలంలో పంటలు పండించడంపై చూపిస్తున్న మక్కువ భూసారం పెంచడంపై చూపించడం లేదు. రబీ తర్వాత వేసవిలో ఆయా భూముల్లో దుక్కులు చేపట్టడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి.

పూర్వీకుల పద్ధతి

మన పూర్వీకులు ఏ పనిచేసినా అప్పటి ప్రయోజనాలతో పాటు భవిష్యత్ గురించి ఆలోచించేవారు. ముఖ్యంగా వ్యవసాయంలో భూసారాన్ని కాపాడుకుంటూ నాణ్యమైన పంటలు పండించే దిశగా అడుగులు వేసేవారు. ఖరీఫ్ సీజన్‌కు సమాయత్తమయ్యే పొలాల్లో వేసవి సమయంలో దుక్కులు చేపట్టి భూసార పరిరక్షణకు చర్యలు తీసుకునేవారు. కాలక్రమంలో అన్నదాతలు ఆధునికత పేరుతో బిజీ అయిపోయి వేసవి దుక్కులు చేపట్టడం చాలావరకు మానేశారు.

మంచి దిగుబడులు

మెట్ట ప్రాంతంలో ముఖ్యంగా వరి సాగులో ముందుండే శ్రీకాకుళం జిల్లాలోని రైతులు చాలామంది వర్షాలు కురిసిన వెంటనే వేసవి దుక్కులు చేస్తుంటారు. అయితే ఎండల తీవ్రతతో భూములు కూడా భగభగమంటూ కాగిపోతున్న తరుణంలో దుక్కులు చేయడం ఎలా అని చాలా మంది రైతులకు సందేహం రావచ్చు. బోర్లు, సాగునీటి సదుపాయాలు ఉన్నవారు ఇప్పటికే వేసవి దుక్కులు ప్రారంభించారు. మిగిలిన వారు నైరుతి రుతుపవనాలు ఈసారి నిర్ణీత సమయంలోనే వచ్చే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ చెబుతున్న నేపథ్యంలో కాస్తోకూస్తో వర్షాలు పడిన వెంటనే చేపట్టవచ్చు. వేసవి దుక్కులు చేపట్టి పశువుల పెంట వేయడం ద్వారా ఆయా భూముల్లో భూసారం వృద్ధి చెంది, సాగు చేసే పంటలు మంచి దిగుబడిని ఇస్తాయి.

ప్రయోజనాలు..

- వేసవిలో పొలాలను దుక్కు చేయడం వల్ల ఆయా పొలాల్లో పెరిగిన గడ్డి నశించిపోవడంతో పాటు వరిమోనలు కుళ్లి భూమిలో కలిసిపోయి ఎరువుగా మారుతాయి.
- భూమిలో ఉండే వివిధ రకాల పురుగులు పైకి రావడం వల్ల వాటిని పక్షులు ఆహారంగా తీసుకుంటాయి. తదుపరి వేసే పంటలకు నష్టం వాటిల్లకుండా నివారిస్తాయి.
- పక్షులు ఆహారంగా తీసుకోగా మిగిలిన పురుగులు వేసవి ఎండల తీవ్రతకు చనిపోతాయి. తద్వారా ఆ పొలంలో పురుగుల ఉధృతి తగ్గుతుంది.
- తెగుళ్లకు కారణమయ్యే శిలీంద్రాలు కూడా ఈ ఎండలకు చనిపోవడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. సాగు చేసే పంటలకు తెగుళ్ల బెడద లేకుండా నివారించవచ్చు.
- రైతు ఇదే సమయంలో దుక్కు చేసిన పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలను చల్లితే భూమి సారాన్ని కూడా పెంపొందించుకునే అవకాశం ఉంటుంది.

వేసవి దుక్కులు చేయడం మంచిది



నూరగా నూరగా రాళ్లు కూడా పిండి అయిపోతుంటాయి. మన పొలాల్లో విరామం లేకుండా పంటలు పండిస్తూ పోతుంటే వాటిలో సారం కరిగిపోతుంది. ఈ సమస్యను నివారించేందుకు పొలాల్లో వేసవి దుక్కులు చేపట్టడం ఎంతో అవసరం. రబీ పంట తర్వాత పొలాల్లో వేసవి దుక్కులు చేయడం వల్ల చీడ పురుగులు, శిలీంద్రాలు చనిపోతాయి. గడ్డి, గరప కుళ్లి నేల సారవంతంగా తయారవుతుంది. వేసవి దుక్కుల చేసిన పొలాల్లో తెగుళ్ల బెడద చాలావరకు ఉండదు. తద్వారా దిగుబడులు బాగుంటాయి.

– బి.సంధ్య, వ్యవసాయాధికారి, హిరమండలం

పూర్వీకుల ముందు చూపు



పూర్వీకులు ఏ పని చేసినా ముందు చూపుతో చేసేవారు. అందులో వ్యవసాయంలో వారు అనుసరించే అనేక పద్ధతులు నేటికీ ఆచరణ యోగ్యంగా ఉన్నాయి. అలాంటి వాటిలో మనం పంటలు పండించే పొలంలో వేసవి దుక్కులు చేపట్టడం ఒకటి. దీని వల్ల ఆ భూమిలో ఉండే చెత్తా చెదారం కలుపులు అన్నీ భూమిలో కలిసి ఆపై కురిసే వర్షపు చినుకులకు అవి కుళ్లి భూసారం పెరుగుదలకు తోడ్పడతాయి. అదే సమయంలో మనం కూడా పశువు పెంటను చల్లితే మరింత సారవంతమవుతాయి.

– లుకలాపు శ్రీనివాసరావు, రైతు కిట్టలపాడు

● జగన్నాథుని సన్నిధిలో గవర్నర్



రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్ సతీసమేతంగా పూరీ శ్రీజగన్నాథుని శుక్రవారం దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రజలందరి సంక్షేమం, శ్రేయస్సు కోసం భగవంతుడిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. – భువనేశ్వర్

నేడు బీజేపీ శాసనసభా పక్షం సమావేశం

- ముఖ్యమంత్రి అభ్యర్థి ఖరారుపై ఉత్కంఠ

భువనేశ్వర్: రాష్ట్రంలో కొత్త ముఖ్యమంత్రిపై సర్వ త్రా ఉత్కంఠ నెలకొని ఉంది. తాజాగా ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ పూర్తి సంఖ్యా గరిష్టతో ప్రభుత్వం ఏర్పాటుకు అర్హత సాధించింది. అయితే ఆ పార్టీ నుంచి ముఖ్య మంత్రి అభ్యర్థి ఇంతవరకు ఖరారు కానందున అందరి దృష్టి కొత్త ముఖ్యమంత్రి అభ్యర్థిపై ఉంది. ఈ నేపథ్యంలో శనివారం బీజేపీ శాసనసభా పక్షం సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో కొత్త ముఖ్యమంత్రి అభ్యర్థిని ఖరారు చేస్తారు. అయితే అంతకుముందే బీజేపీ కేంద్ర నాయకత్వం రాష్ట్ర ముఖ్యమంత్రిని నిర్ధారిస్తుంది. శనివారం భువనేశ్వర్‌లో పార్టీకి చెందిన ఎన్నికైన శాసన సభ్యులందరితో సమావేశం జరగనున్నట్లు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే రబీ నారాయణ్ నాయక్ శుక్రవారం మీడియా ప్రతినిధులకు తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతి ప్రకారం ప్రభుత్వానికి నాయకత్వం వహించే నాయకుడిని శాసన సభా పక్షం నిర్ణయిస్తుందన్నారు. బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ గతంలో ప్రకటించినట్లుగా ముఖ్యమంత్రి పై బీజేపీ పార్లమెంటరీ బోర్డు నిర్ణయం తీసుకుంటుంది. క్రమశిక్షణ కలిగిన పార్టీగా బీజేపీ శాసనసభా పక్ష సమావేశంలో కేంద్ర నాయకులు నిర్ణయించిన పేరును ఆమోదిస్తుందని నాయక్ తెలిపారు. ఇదిలా ఉండగా రాష్ట్రానికి చెందిన కొత్తగా ఎన్నికైన ఎంపీలు పార్టీ కేంద్ర నేతలతో సమావేశానికి న్యూఢిల్లీ వెళ్లారు. రాష్ట్రానికి చెందిన పార్టీ ఎంపీలతో కేంద్ర నేతలు చర్చించిన తర్వాత బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశం కానుంది. ఒడిశా కొత్త ముఖ్యమంత్రిని నిర్ణయించడానికి పార్టీ పార్లమెంటరీ బోర్డు శుక్రవారం రాత్రి సమావేశమయ్యే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. రాష్ట్ర శాసన సభాపక్షం ఆమోదించే వరకు ముఖ్యమంత్రి అభ్యర్థి పేరును బహిరంగపరచబోమని సంబంధిత వర్గాలు తెలిపాయి.

ఎలక్ట్రికల్ స్తంభానికి మంటలు



స్తంభంపై మంటలు చెలరేగిన దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక గాంధీనగర్ జంక్షన్ వద్ద ఎలక్ట్రిక్ స్తంభంపై గురువారం రాత్రి మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. టాటా పవర్ డిస్ట్రిబ్యూషన్ సిబ్బందికి ఫోన్ చేసినా సమయానికి రాకపోవడంతో స్థానికులు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దీంతో కరెంట్ సరఫరా రాత్రి 11 గంటల వరకూ పునరుద్ధరణ జరగలేదు. అనంతరం ఓడ్రాఫ్ బృందం విచ్చేసి పూర్తిగా మంటలను ఆపారు. కాగా టాటా పవర్ ఇంజినీర్ల నిర్లక్ష్య వైఖరికి ప్రజలు నిరసన తెలిపారు. మెయిన్ లైన్ పీవీసీ వైర్లు, లోకల్ వైర్లు కలిసిపోవడంతో మంటలు ఏర్పడినట్లు ఎలక్ట్రికల్ సిబ్బంది తెలిపారు.

వడదెబ్బకు ఉపాధి వేతనదారు మృతి



సంఘటనా స్థలం వద్ద ఎర్రయ్య మృతదేహం

వజ్రపుకొత్తూరు: మండలంలోని కొత్తపేట పంచాయతీ దిబ్బవానిపేటకు చెందిన ఉపాధి వేతనదారు ఎర్రయ్య(59) వడదెబ్బకు గురై మృతి చెందారు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఎర్రయ్య శుక్రవారం ఉదయం స్థానిక దుమ్మువారి అమ్మోరు చెరువులో జరుగుతున్న ఉపాధి పనుల కోసం వెళ్లారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో వేతనదారులంతా ఉదయం 10 గంటలకు పనులు ముగించుకుని ఇంటికి చేరుకున్నారు. ఎర్రయ్య మాత్రం చెరువు వద్దే ఉండిపోయారు. ఆయనను ఎవరూ గమనించలేదు. మళ్లీ తిరిగి సాయంత్రం చెరువు వద్దకు వేతనదారులంతా వెళ్లినప్పుడు గట్టుపై ఎర్రయ్య చలనం లేకుండా కనిపించారు. వారంతా దగ్గరకు వెళ్లి చూస్తే ప్రాణం లేదు. దీంతో కుటుంబ సభ్యులకు, ఉపాధి అధికారులకు సమాచారం అందజేశారు. మృతుని భార్య పోలమ్మ కరోనా సమయంలో వైరస్ సోకి మృతి చెందగా, కుమార్తె అరుణ మాత్రమే ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరై రోదించారు. నిరుపేద కుటుంబం కనుక ప్రభుత్వం మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ట్రాఫిక్ ఐలాన్‌ను ఢీకొట్టిన పార్సిల్ వ్యాన్

శ్రీకాకుళం క్రైమ్ : గురువారం అర్ధరాత్రి దాటాక నగరంలోని జీటీ రోడ్డులో ఉన్న ట్రాఫిక్ ఐలాన్ (బూత్)ను గుర్తు తెలియని పార్సిల్ వ్యాను ఢీకొట్టిన ట్లు సీఐ అవతారం పేర్కొన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా పోలీసులు అందులో ఉండేందుకు ఏర్పాటు చేసిన ఈ ట్రాఫిక్ ఐలాన్‌ను వ్యాను ఢీకొట్టడంతో అది ఒరిగి అక్కడే ఉన్న రెండు ద్విచక్రవాహనాలపై పడింది. సమీప సీసీ ఫుటేజీలో ఢీకొట్టిన వ్యాను వివరాలేమైనా దొరుకుతాయన్న కోణంలో పరిశీలిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా సహస్ర దీపాలంకరణ


స్వామి సన్నిధిలో సహస్ర దీపారాధన జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన పూజలు నిర్వహించిన తరువాత యాగశాలలో నిత్య హోమాలు, వెండి మంటపం వద్ద స్వామి కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. సాయంత్రం 6 గంటలకు సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా దీపారాధన మంటపంపైకి తీసుకువచ్చి ప్రత్యేక ఊయలలో ఆసీనులను చేశారు. అనంతరం దీపాలు వెలిగించి ఊంజల్ సేవ జరిపించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలి


పీవో సమక్షంలో సీల్డ్ టెండర్‌లు తెరుస్తున్న సిబ్బంది

సీతంపేట: గిరిజన సంక్షేమ వసతిగృహాలకు సరఫరా చేసే సరుకులు నాణ్యమైనవిగా ఉండాలని సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టుఅధికారి శుభం బన్సల్ స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జీసీసీ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులకు టెండర్లు నిర్వహించారు. సీల్డ్ కొటేషన్లు ఆయన సమక్షంలో తెరిచారు. ఈ సందర్భంగా పీవో పలు సూచనలు చేశారు. కందిపప్పు, బన్సీరవ్వ, మినపపప్పు, శనగపప్పు, కారం, మసాలా దినుసులు తదితర 25 రకాల వస్తువులకు టెండర్లు జరగ్గా పదిమంది టెండర్‌దారులు హాజరయ్యారు. కార్యక్రమంలో జీసీసీ డీఎం సంధ్యారాణి, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, సీతంపేట, పాతపట్నం బ్రాంచ్ మేనేజర్లు దాసరి కృష్ణ, గొర్లె నరసింహులు, వసతిగృహ సంక్షేమాధికారులు వెంకటినాయుడు, హెచ్.శారద, పాలక అమల పాల్గొన్నారు.

లారీ, ఆటో ఢీకొని 12మందికి స్వల్ప గాయాలు


బోల్తా పడిన ఆటో

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలంలోని నర్సిపురం జనహిత స్కూల్ దగ్గర శుక్రవారం లారీ, ఆటో ఢీకొనడం 12మందికి స్వల్ప గాయాలయ్యాయి. పార్వతీపురం నుంచి మరిపివలస వైపు వెళ్తున్న ఆటోను లారీ వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు ప్రయాణికులు గాయపడ్డారు. స్థానికంగా ఉన్న పశువుల కాపరులు క్షతగాత్రులను పార్వతీపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే ప్రమాదం జరిగిన వెంటనే లారీతో డ్రైవర్ పరారయ్యాడు.

ఐదుగురికి గాయాలు

- పార్వతీపురం ఫ్లైఓవర్‌పై ప్రమాదం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం ఫ్లైఓవర్‌పై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయాలపాలయ్యారు. ఆటోను లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. గాయపడిన వారిని వీరఘట్టం మండలంలోని హుస్సేన్ పురం గ్రామస్తులుగా గుర్తించారు. వీరఘట్టం నుంచి పార్వతీపురం రైల్వే స్టేషన్‌కు వారు వెళ్తుండగా ప్రమాదం సంభవించింది. క్షతగాత్రులను పార్వతీపురం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

కలెక్టర్ నాగలక్ష్మికి అభినందనలు


కలెక్టర్ నాగలక్ష్మిని అభినందిస్తున్న ఫోరమ్ ఫర్ బెటర్ విజయనగరం సంస్థ ప్రతినిధులు

విజయనగరం: జిల్లాలో 2024 సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించిన కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్‌ను ఫోరమ్ ఫర్ బెటర్ విజయనగరం సంస్థ ప్రతినిధులు శుక్రవారం అభినందించారు. కలెక్టర్ కార్యాలయంలో ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు సజావుగా సాగడానికి సహకరించిన ప్రజలకు, రాజకీయ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫోరం అధ్యక్షుడు డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, కార్యదర్శి కాపుగంటి ప్రకాష్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ రవ్వా శ్రీనివాస్, రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, రోటరీ క్లబ్ జాయింట్ సెక్రటరీ రాజేంద్రకుమార్, లిఫ్టింగ్ హ్యాండ్స్ ప్రెసిడెంట్ శంకర్, రోటరియన్ హేమకుమార్ పాల్గొన్నారు.

అతిసారను తరిమికొడదాం

- ఓఆర్‌ఎస్‌తో సమస్య నివారణకు అవకాశం
- క్షేత్రస్థాయిలో వైద్య బృందాలతో విస్తృత ప్రచారం
- ఐదేళ్ల లోపు పిల్లలకు డయేరియా సోకే ఆస్కారం
- వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలంటున్న వైద్యాధికారులు


క్షేత్ర స్థాయిలో అతిసారపై అవగాహన కల్పిస్తూ ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

పాలకొండ రూరల్: వేసవి సీజన్ పూర్తి కావస్తుండడంతో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. ఈ తరుణంలో ఇంతవరకు నిద్రావస్థలో ఉన్న వివిధ రకాల వైరస్‌లు మేల్కొని ప్రజారోగ్యంపై దాడి చేసే ప్రమాదముంది. ముఖ్యంగా అతిసార(డయేరియా) వృద్ధి చెందేందుకు ఇది అనుకూలమైన వాతావరణం అని వైద్యులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అతిసారకు చెక్ పెట్టేందుకు వైద్య ఆరోగ్యశాఖ నేతృత్వంలో విస్తృతంగా అవగాహన చేట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. త్వరలో గ్రామస్థాయిలో వైద్య బృందాలు పర్యటించి పక్షోత్సవాలను నిర్వహించనున్నాయి. వేసవి సీజన్ మారే సమయంలో పిల్లలకు డయేరియా సోకే అవకాశముంది. ప్రస్తుత జూన్ నెలలో ఈ తరహా ఆరోగ్య సమస్యల బారిన పడేవారి సంఖ్య అధికంగా ఉంటుంది. ఆరు నెలల నుంచి ఏడాది లోపు చిన్నారులు ఈ సమస్య బారిన పడితే అధికంగా నీళ్ల విరోచనాలు అయ్యి భారీగా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

రోటా వైరస్ కారణంగా...

జూన్ నెలలో సంభవించే సీజన్ మార్పులో భాగంగా రోటా వైరస్ ఉధృతమై డయేరియా సోకే అవకాశముంది. ఈ వైరస్ తాగే నీరు, కలుషిత ఆహారం, ఇతర తినుబండారాల ద్వారా శరీరంలోకి వెళ్లి అతిసారకు దారితీస్తుంది. పిల్లలు, పెద్దలు తేడా లేకుండా సోకే ఈ ఆరోగ్య సమస్యతో అవస్థలు తప్పవు. సీజన్‌లో అధికంగా పిల్లలపై ఈ వైరస్ ప్రభావం చూపుతుంది.

క్షేత్రస్థాయిలో అవగాహన

ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ ఫ్యామిలీ డాక్టర్ విధానంతో వైద్యాన్ని పేదల గడపకు గత ప్రభుత్వం తీసుకెళ్లింది. దీంతో ఆరోగ్య భద్రత, వ్యాధుల బారినుంచి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన పెరుగుతోంది.ప్రస్తుత సీజన్‌లో ఆశ కార్యకర్తలు ఐదేళ్ల లోపు పిల్లలు ఉన్న ప్రతి ఇంటికి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారు. పీహెచ్‌సీలు, విలేజ్ క్లినిక్‌లు, అంగన్వాడీ కేంద్రాల్లో ఓఆర్‌ఎస్ పౌచ్‌లు అందుబాటులో ఉంచడంతోపాటు జింక్ కార్నర్‌లను ఏర్పాటు చేయనున్నారు. డయేరియా సోకిన పిల్లలకు 14 రోజులు జింక్ మాత్రలు అందించేలా చర్యలు చేపట్టనున్నారు. సమస్య అధిగమించి నప్పటికీ తిరిగి మళ్లీ డయేరియా బారిన పడకుండా అవసరమైన మందులు సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. బాలింతలు, ఐదేళ్ల లోపు పిల్లలున్న తల్లులు అవగాహన పెంచుకోవాలి. పిల్లల్లో నీళ్ల విరేచనాలు జరుగుతుంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని సిద్ధం చేసే విధానం తెలుసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

బిడ్డకు తల్లిపాలు అందించాలి



పిల్లలకు అతిసార సోకి నీళ్ల విరేచనాలు అవుతున్న సమయంలో, అనంతరం అయినా తల్లి తన పాలను అందించడం బిడ్డకు శ్రేయస్కరం. ఆరు నెలల లోపు పిల్లలకు కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలి. ఐదేళ్ల లోపు చిన్నారులకు నోటి ద్వారా, అనుబంధ ఆహారం అధికంగా ఉండేలా చూసుకోవాలి. బిడ్డకు ఆహారం తినిపించేందుకు, వంట చేయడానికి ముందు బిడ్డల మల, మూత్ర విసర్జన తీసివేసిన తరువాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. నీళ్ల విరేచనాలు సంభవిస్తే ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని నిర్దేశిత మోతాదులో అందించాలి. అలసత్వం లేకుండా వైద్యులను సంప్రదించాలి.

జి.నాగభూషణరావు,
ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, పాలకొండ

ఓఆర్‌ఎస్‌తో అధిక శక్తి..

అతిసార సోకిన చిన్నారులకు ఓఆర్‌ఎస్ ద్రావణం సంజీవనిలా పనిచేస్తుంది. రోగ నిరోధక శక్తిని పెంచడంతోపాటు శరీరం నుంచి బయటకు పోయే వ్యర్థాలు, నీటి నిల్వల కారణంగా కలిగే అనాశక్తి నుంచి రక్షణ కల్పించేందుకు ఓఆర్‌ఎస్ ఎంతగానో ఉపయోగపడుతుంది. దీనిపై వైద్య బృందాలు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పిస్తుండడంతో డయేరియా జాడలు గతంతోపోల్చుకుంటే తగ్గుముఖం పడుతున్నాయి. మారుమూల ప్రాంతాల్లో సైతం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంటున్నాయి. అతిసార లక్షణలు కనిపించినప్పుడు లేదా నీళ్ల విరేచనాలు అవుతున్నప్పుడు ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని అందించడం ద్వారా బాధితుడు డీహైడ్రేషన్ బారి నుంచి రక్షణ పొందుతాడు. అలాగే ఎండలో అధికంగా తిరగకపోవడం, కాచి, చల్లార్చిన నీటిని తాగడం, వేడి ఆహార పదార్థాలను ఆరగించడం ద్వారా ఈ సమస్యకు చెక్ పెట్టే అవకాశముంది. ముఖ్యంగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి.

కలెక్టర్‌ను కలిసిన ఢిల్లీ కమిటీ

- ప్రిజం-10 ప్రాజెక్టు అమలుపై జిల్లాలో పరిశీలన


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న డీఓపీటీ డైరెక్టర్ మొలాయ్ శాన్యాల్

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రిజం-10 ప్రాజెక్టును పరిశీలించేందుకు ఢిల్లీ నుంచి కమిటీ జిల్లాకు శుక్రవారం విచ్చేసింది. క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్న పరిస్థితిని జిల్లాలో ఈ కమిటీ శనివారం పరిశీలిస్తుంది. కమిటీ సభ్యులుగా డీఓపీటీ డైరెక్టర్ మొలాయ్ శాన్యాల్, బొగ్గు మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రటరీ (సీపీడీ) సుదర్శన్ భగత్ జిల్లాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిషాంత్ కుమార్‌ను కలెక్టరేట్‌లో వారు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో ప్రిజమ్-10 ప్రాజెక్టు అమలు, ఆవశ్యకత, పురోగతి విధానాన్ని వారికి కలెక్టర్ వివరించారు. గిరిజన గ్రామాల్లో రక్తహీనతపై అవగాహన, ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందే విధంగా చేపట్టిన చర్యలపై స్పష్టంగా తెలియజేశారు. మహిళలకు గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం వరకు సచివాలయం సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్‌లతో పాటు ఒక దత్తత అధికారితో ఎనీమియా యాక్షన్ కమిటీ నియమించి ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టినట్లు తెలిపారు. సకాలంలో పౌష్టికాహారం అందించి, అవసరమైన ఆరోగ్య పరీక్షలు నిర్వహించి రక్త హీనత లోపం నియంత్రణకు దృష్టి సారించామని చెప్పారు. ప్రిజం -10 కార్యక్రమం ద్వారా మాతా, శిశు మరణాల నియంత్రణ ప్రతిష్టాత్మకంగా తీసుకుని లక్ష్య సాధన దిశగా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చినట్లు తెలిపారు. ముఖ్యంగా పది సంవత్సరాల లోపు వయస్సు కలిగిన చిన్నారులు మృత్యువాత పడకూడదనే ధ్యేయంతో ప్రత్యేక శ్రద్ధతో అమలు చేస్తున్నామని తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు మండల స్థాయిలో పర్యవేక్షిస్తున్నారని, ఇప్పటికే మంచి మార్పులు గమనించామని, రానున్న రోజుల్లో మరిన్ని మంచి ఫలితాలు సాధించగలమని కలెక్టర్ స్పష్టం చేశారు.

కొనసాగుతున్న 'జిందాల్' ఆందోళన

- కర్మాగారం తెరిపించాలని కార్మికుల డిమాండ్


కర్మాగారం గేటు వద్ద ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులు

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం గ్రామం సమీపంలో గల జిందాల్ స్టెయిన్‌లెస్‌స్టీల్ కర్మాగారాన్ని తక్షణమే తెరిచి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. కర్మాగారం ఎదుట కార్మికులు చేస్తున్న ఆందోళన శుక్రవారం నాటికి 20వ రోజుకు చేరుకుంది. ముడిసరుకు కొరత కారణంగా 20 రోజుల క్రితం అర్ధాంతరంగా లేఆఫ్ ప్రకటించి కర్మాగారం మూసేశారు. దీంతో నాటి నుంచి కర్మాగారం గేటు వద్ద కార్మికులు వంటావార్పుతో ఆందోళన చేస్తున్నారు. కాగా కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిల్లా అప్పలరాజు, గాడి అప్పారావు,పప్పల బంగారు నాయుడు, లగుడు వామాలు, నమ్మి చిన్నబాబు తదితరులు మాట్లాడుతూ అన్యాయంగా కర్మాగారాన్ని యాజమాన్యం మూసేసిందని, కర్మాగారం లాభాల బాటలో పయనించేందుకు సర్వశక్తులు ఒడ్డి పనిచేశామని ఇప్పుడు ముడిసరుకు కొరత చూపి మూసివేయడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు 40 సంవత్సరాలు కర్మాగారాన్ని నమ్ముకుని పని చేశామని ఇప్పుడు మూసేస్తే మా కుటుంబాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కర్మాగారంలో పనిచేస్తున్న 287కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం తక్షణమే స్పందించి కార్మికులందరికీ సమానంగా లేఆఫ్ అందించి పని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన సింహాచలం

పార్వతీపురంటౌన్: మండలంలోని వెంకంపేట పంచాయతీ వైకేఎం నగర్ కాలనీలో ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై రూరల్ ఎస్సై దినకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వైకేఎం కాలనీలో అద్దెకు ఉంటున్న సింహాచలం (39) ఇంట్లో భార్యాబిడ్డలు లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకున్నాడు. ఆత్మహత్యకు పాల్పడడానికి కారణం ఆర్థికంగా ఇబ్బందులని బంధువులు తెలిపారు. ఫర్నిచర్ షాపులో పనిచేస్తున్న సింహాచలానికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

మొక్కజొన్నలో పోషకాలు

- మధుమేహ వ్యాధిగ్రస్తులకు అధిక మేలు
- సూచిస్తున్న వైద్య,ఆరోగ్య నిపుణులు


కొండకెంగువ వీధిలో జొన్నలు ఆరబెడుతున్న రైతులు


రామభద్రపురంలో సాగులో ఉన్న తీపి మొక్కజొన్న పంట

రామభద్రపురం: పిల్లల నుంచి పెద్దల వరకు మొక్కజొన్నను ఇష్టపడని వారుండరు. వేడివేడిగా కాల్చుకుని తిన్నా..లేదా ఉడకబెట్టి తిన్నా రుచి ఉండడమే కాకుండా శక్తివంతమైన ఆహారం, శరీరానికి కావాల్సిన పోషకాలన్నీ మొక్కజొన్నలో పుష్కలంగా ఉన్నాయని వైద్య,ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. అంగన్‌వాడీ పిల్లలకు పౌష్టికాహారంగా, ఈ రోజుల్లో మధుమేహంతో బాధపడుతున్న వారికి మొక్కజొన్న ఎంతో మేలు చేస్తుంది. పశువులకు, కోళ్ల దాణాకు అధికంగా మొక్కజొన్నను ఉపయోగిస్తున్నారని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.


నాయుడువలసలో మొక్కజొన్న కంకులను ఎగుమతికి సిద్ధం చేస్తున్న రైతులు

మొక్కజొన్నలో లభించే పోషకాలు..

మొక్కజొన్నలో మెగ్నీషియం, ఐరన్, కాపర్, ఫాస్పరస్ ఉంటాయి. దీని వల్ల ఎముకలు దృఢంగా తయారవుతాయి.

- పేగు క్యాన్సర్ నియంత్రణకు ఉపయోగపడుతుంది. మలబద్ధకం, మొలలు వంటి వ్యాధులు దరిచేరకుండా ఉంచేందుకు మొక్కజొన్నలోని ఫైబర్ ఎంతో ఉపయోగపడుతుంది.
- జీర్ణక్రియ సాఫీగా జరిగేందుకు తోడ్పడుతుంది. అలాగే ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని కాంతివంతంగా మారుస్తాయి.
- శిరోజాలు ఆకర్షణీయంగా కనిపించడానికి మొక్కజొన్నలో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్ లైకోపిన సహాయపడుతుంది. మొక్కజొన్న గింజలు ఎండిన తర్వాత వాటి నుంచి తీసిన నూనెను చర్మానికి రాసుకుంటే చర్మం నిగనిగలాడుతుంది.
- గుండెను చెడు కొలెస్ట్రాల్ నుంచి ఎప్పటికప్పుడు కాపాడుతూ ఉంటుంది. ఇది రక్తప్రసరణ మెరుగు పరిచేందుకు కూడా ఉపయోగపడుతుంది.
- కిడ్నీ వ్యాధులతో బాధపడేవారు మొక్క జొన్న తింటే మంచిది.

ఆరోగ్యవంతమైన ఆహారం..



మొక్కజొన్న పిండి, కంకులు ఆరోగ్యవంతమైన ఆహారం.వీటిలో పీచు పదార్థం ఎక్కువ, కొవ్వు తక్కువగా ఉంటుంది. దీనిలో విటమిన్స్, కేలరీస్, మినరల్స్ అధికంగా ఉంటాయి. బీపీ ఉన్న వారు తింటే బీపీ తగ్గుతుంది. హార్ట్ సమస్యలు లేకుండా చేస్తుంది. ఇది శరీరానికి మంచి శక్తినిస్తుంది. దిలీప్‌కుమార్,
మండల వైద్యాధికారి, రామభద్రపురం

పాలు పెరుగుదలకు ఉపయోగపడతాయి..



మొక్కజొన్నలో కార్బొహైడ్రేట్స్ అధికంగా ఉంటాయి. అందువల్ల పశువులు, కోళ్ల దాణాకు ఉపయోగిస్తారు.పాడి పశువులకు పాలు పెరగడానికి,కోళ్ల వేగంగా పెరగడమే కాకుండా బరువు పెరుగుదలకు మొక్కజొన్న ఉపయోగపడుతుంది, ఇది శక్తివంతమైన ఆహారం కాబట్టి కోళ్లు 45 రోజుల్లో 2 కేజీల నుంచి రెండున్నర కేజీల బరువు పెరుగుతాయి. దీనిలో కొవ్వు పదార్థం ఉంటుంది. అందుచేత పశువులకు పశుగ్రాసంగా ఉపయోగిస్తారు.

ఎల్ విష్ణు, పశు సంవర్థక శాఖ ఎ.డి, బొబ్బిలి

ఆటస్థలం కాదు.. జలాశయం

వెంగళరాయ జలాశయ ప్రాంతంలో క్రికెట్ ఆడుతున్న పిల్లలు


సాలూరు రూరల్: రుతుపవనాలు రాష్ట్రంలో ప్రవేశించినప్పటికీ ఇంతవరకు భారీవర్షాలు కురవకపోవడంతో చెరువులు, జలాశయాలు వెలవెలబోతున్నాయి. పాఠశాలలకు సెలవులు కావడంతో గ్రామీణ విద్యార్థులకు జలాశయాలు, చెరువులు ఆటలు ఆడుకునేందుకు ఉపయోగపడుతున్నాయి. ఆకోవలోనే వెంగళరాయ సాగర్‌లో ఇంతవరకు నీరు చేరకపోవడంతో ఎండిన జలాశయం ప్రాంతాన్ని ఆడుకునేందుకు పిల్లలు వినియోగించుకుంటున్నారు. శుక్రవారం పిల్లలు వెంగళరాయ సాగర్‌లో క్రికెట్ ఆడుతూ కనిపించారు.

క్వారీపై నుంచి జారిపడి కూలీ మృతి


క్వారీలో మెడకు తాడు తగిలి చనిపోయి వేలాడుతున్న అప్పారావు మృతదేహం

శృంగవరపుకోట: కుటుంబాన్ని పోషించుకోవడం కోసం నిత్యం పనిచేస్తున్న క్వారీకి వెళ్లిన కార్మికుడు మృత్యువు బారిన పడ్డాడు. మండలంలోని ధర్మవరం గ్రామంలో శుక్రవారం ఉదయం 6గంటల సమయంలో గ్రామానికి సమీపంలో దెయ్యాలమెట్ట వద్ద ఉన్న క్వారీ నుంచి జారిపడి కార్మికుడు మృతిచెందిన వార్తతో గ్రామం శోకసంద్రమైంది. ఈ ఘటనకు సంబధించిన వివరాలిలా ఉన్నాయి. ధర్మవరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న లోతేటి అప్పారావు(25) గ్రామానికి దగ్గరలో ఉన్న దెయ్యాలమెట్టపై ఉన్న క్వారీలో చేతితో రాయిని కొడుతూ ఇళ్ల నిర్మాణాల కోసం అమ్ముతుంటాడు. అతనితో పాటు అదే క్వారీలో మరో 21 మంది కార్మికులు పని చేస్తుంటారు. శుక్రవారం ఉదయం 5గంటల సమయంలో క్వారీకి వెళ్లిన అప్పారావు రాయి కొట్టేందుకు మెట్టపైకి ఎక్కాడు. సాధారణంగా రాతి క్వారీలో పనిచేసే కార్మికులు ఎప్పుడైనా కాలు జారినా ప్రమాదం పాలవకుండా ఉండేందుకు నడుముకు బలమైన తాడుకట్టి, చేతిలో ఒక తాడు ఉంచుకుని తాడు సాయంతో కిందకు దిగుతూ పనిచేస్తారు. అప్పారావు రాయి కొడుతున్న సమయంలో కాలు జారి కిందకు పడిపోతున్న సమయంలో చేతిలో ఉన్న తాడు మెడకు చిక్కుపడింది. తాడును తీసుకునే అవకాశం లేకుండానే మెట్ట సగానికి జారిపోవడంతో తాడు మెడకు ఉరిలా బిగుసుకుపోయి చనిపోయాడు. అప్పారావే కుటుంబానికి ప్రధాన ఆధారం. ఇటీవల కూతురికి పెళ్లి చేయడం, హృద్రోగంతో అవస్థ పడుతున్న తల్లి, ఇటీవల ప్రమాదం బారిన పడిన కొడుక్కి ఆపరేషన్ చేయించాడు. ఇలా పీకల్లోతు కష్టాల్లో ఉన్న కుటుంబానికి పెద్దదిక్కయిన అప్పారావు అకస్మాత్తుగా చనిపోవడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. అప్పారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ఆస్పత్రికి తరలించేందుకు పైసలు లేక ఇబ్బంది పడుతుంటే ఆటో వర్కర్స్ యూనియన్ రూ.5వేలు సాయం అందించారు. ఎస్.కోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని విద్యార్థి..

గోపాలపట్నం (విశాఖ): గోపాలపట్నం నుంచి కొత్తపాలెం వెళ్లే అండర్ పాస్‌వే సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటనపై జీఆర్‌పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా పూసపాటిరేగ సమీప కుమిలి గ్రామానికి చెందిన కర్రి వసంత్ కుమార్(19) ఐటీఐ పూర్తి చేసి అప్రెంటిస్‌షిప్ చేసేందుకు విశాఖ వచ్చాడు. కొత్తపాలెంలో బంధువుల ఇంటి వద్ద ఉంటున్నాడు. గురువారం రాత్రి భోజనం చేశాక బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వచ్చాడు. ఎంతకీ రాకపోవడంతో బంధువులు శుక్రవారం ఉదయం చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోయింది. రైల్వే ట్రాక్‌పై మృతదేహం పడి ఉందన్న సమాచారంతో రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా బంధువులకు సమాచారమందించారు. కొద్ది రోజులుగా బంధువుల ఇంటి వద్దే ఉంటున్న వసంత్‌కుమార్ మృతితో కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి జీఆర్‌పీ ఎస్సై బాలాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

2025 నాటికి క్షయవ్యాధి రహిత రాష్ట్రంగా ఏపీ


క్షయవ్యాధి నివారణ టీకా కార్యక్రమంపై వైద్యాధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ టి.రమేష్

కొత్తవలస: ఆంధ్రప్రదేశ్‌ను 2025 నాటికి క్షయవ్యాధి రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని క్షయవ్యాధి నిర్మూలన విభాగం రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ టి.రమేష్ తెలిపారు. ప్రస్తుతం పైలెట్ ప్రోగ్రాంలో భాగంగా వయోజనులకు వేస్తున్న క్షయవ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని కొత్తవలస పీహెచ్‌సీలో శుక్రవారం పరిశీలించారు. వైద్యాధికారులు సీతల్‌వర్మ, సీతామహాలక్ష్మితో మాట్లాడి టీకా కార్యక్రమ వివరాలను అడిగి తెలుసుకున్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరికీ టీకాలు వేయాలని సూచించారు. టీకాలు వేసుకునేందుకు నిరాకరించేవారికి అవగాహన కల్పించాలన్నారు. టీకా వేయడంలో రాష్ట్రంలోనే విజయనగరం ద్వితీయ స్థానంలో ఉందని తెలిపారు. క్షయవ్యాధి లేని సమాజం కోసం విద్యావంతులు, గ్రామ పెద్దలు, పత్రికా విలేకరులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కృప, పీహెచ్‌ఎన్ రమణమ్మ, క్షయవ్యాధి నివారణ సూపర్ వైజర్ శ్రీనివాస్, హెచ్‌సీ సూరిదేముడు, తదితరులు పాల్గొన్నారు.